జయశ్రీ, జూన్, 1970

# రత్నమాల

"మీరు పొరపాటు చేశారు" అన్నది శ్రీదేవి.

శ్రీదేవి అలా అన్నాక నాకు అనుమానమొచ్చింది. నిజంగా నేను పొరపాటు చేశానా? అని.

వాన కురుస్తూనే వుంది! రెండు రోజులనాడు గాలితో ప్రారంభమై వాన వెంటరాగా, జోరున వీచే గాలితో, ప్రకృతి భోరున విలపిస్తున్నది!

రైలు గాలివానను చీల్చుకుని రాచుకుపోయిన గొంతుతో కీచుమంటూ, అరణ్యాల మధ్య కొండలను గుట్టలను తప్పుకుని పరిగెడుతూనే వుంది!

తలుపు తెరిస్తే వాన వచ్చి లోపల పడసాగింది. బెర్తు మీద కూర్చుని విసుగేయసాగింది! ఓ మూలగా పడివున్న మేగజైన్సు తెరచి బొమ్మలు చూస్తూ కూర్చున్నాను. అన్నీ పదే పదే చూచినవే! ఐనా గత్యంతరం లేదు. కంపార్టుమెంటులో తోడెవరూ లేరు! వూరు చేరేంత వరకు ఆ రైలుపెట్టిలో బందీని నేను!

ఇందులో ఎక్కకుండా వుండాల్సింది అనిపించింది! ఓ స్టేషనులో దిగి వెళ్ళి మూడోక్లాసు కంపార్టుమెంటుకు వెళ్ళాను. కిక్కిరిసిన జనం, నేలంతా నీళ్ళు, మట్టి, తడిసి వాసన కొడుతున్న శరీరాలు భరించలేకపోయినాను. పైగా చుట్టల పొగ బయటకు వెళ్ళలేక అక్కడే ఆగిపోయి వుంది. అక్కడే పిల్లలు నిద్ర పోతున్నారు! వయసుగాండ్లు చూపులతో పలకరించుకుంటూ అందాన్ని, ఆనందాన్ని కలబోసుకుంటున్నారు. కొందరు గ్రామ రాజకీయాలు చర్చించుకుంటున్నారు!

ఇవన్నీ చూస్తూ, అక్కర్లేని మాటలు వింటూ బెంగుళూరు దాకా ప్రయాణం చేయాలి.

ఇంతకన్న నరకం యింకేముంది?

మరో పెట్టెకు మారాలన్న ప్రతిపాదన విరమించుకున్నాను అప్పుడే!

కొంతసేపు నిద్ర పోయాను! ఐనా కాలం నా ఊహలలో నడువలేకపోయింది. సిగరెట్టు వుండబట్టి సరిపోయింది! అవీ ఐపోతే?

పుస్తకం తిరగేస్తుంటే సినిమా బొమ్మొకటి కనుపించింది. దాన్నలాగే చూస్తూ వుండి పోయాను! ఆ బొమ్మలోని నటీమణి చాలా అందగత్తె! ఆమె సహజమైన అందాన్ని కెమెరా యింకా యినుమడింప చేసింది.

విశాలంగా చక్రాల్లా వున్న కళ్ళల్లో ప్రసన్నత వున్నా, సముద్రపు గాంభీర్యము పరీక్షగా చూస్తే కనిపిస్తుంది. ఆమె నాసిక రెండు కళ్ళ మధ్య చెలియలి కట్టలో వుండి అంతా కొసదేరి, నుదురు అరచెయ్యంత వుంది. భ్రుకుటి దగ్గర మాత్రం కొద్దిగా పల్లంగా వున్న ట్లుంది. అక్కడ పెట్టిన కుంకుమ విచ్చుకున్న మందార పువ్వులా వుంది. బుగ్గల్లో గులాబీ రేకుల సౌకుమార్యమూ, అందమూ వున్నాయి. గళము పొడుగ్గా శంఖంలా వుంది! ఆమె చిత్రము పరీక్షగా, తీరిగ్గా చూచా! యింకా చూడాలనే వుంది! కానీ.... సిగ్గేసింది! ఏమిటీ యింత పిచ్చివాణ్ణయిపోతున్నాను! అది బొమ్మ! అంతేగా!

నా ఊహలు గొలుసు త్రెంచుకున్న గెరిల్లాలా విహరించసాగాయి! బొమ్మలో యింత అందంగా వుందే!..... ఆమె భౌతికంగా మరెంత బావుంటుందో?

నా చేతి వ్రేళ్ళు ఆమె నును బుగ్గ మీద ప్రాకసాగాయి. వళ్లు గగుర్పొడిచింది! కళ్ళు ఎరుపెక్కే వుంటాయి, నాకు తెలుసు! యిది, ఈ అనుభవం క్రొత్తేం గాదు! రత్నమాలను అనాలోచితంగా స్పర్శించినపుడు, ఆమె కళ్ళల్లోని లోతులు వెతకబోయినప్పుడు నా కిలాంటి అనుభవం కలిగేది.

రత్నమాల యిప్పుడేం చేస్తుంటుంది?

ఎక్కడో వురిమింది, గుండెలు ఝల్లుమనేలా! ఊహలన్నీ చేజారిన గాజు గ్లాసులా చెల్లా చెదురైనాయి.

లేచి వొళ్ళు విరుచుకొన్నాను. టిన్‌లోంచి సిగరెట్ తీసుకు వెలిగించుకుని రెండు దమ్ములు గట్టిగా పీల్చి పొగ మ్రింగేశాను. గుండెల్లో పొగ సుళ్ళు తిరిగి గమ్మత్తుగా వుంది. కిటికీ దగ్గరకు వెళ్ళి గ్లాస్ షట్టర్ ఎత్తి చువ్వల మధ్యనుంచి బయటకు తొంగి చూశాను.

గాలి వానను తరుముతోంది రొద పెడుతూ! చిన్నగా జల్లు పడుతోంది. పాలిపోయిన ఆకాశం ఉండి వుండీ ప్రకృతికి కన్ను గీటుతోంది, మెరుస్తూ మురిపిస్తూ! కనుచూపు మేరలో కన్నీళ్ళు దాచుకున్నాయి పొలాలను, దూరంగా నల్లమల కొండలు స్నానం చేసిన ఏనుగుల్లా నిశ్చలంగా వున్నాయి.

బెంగుళూరు వెళ్ళేప్పటికి ఎప్పుడౌతుందో?

వచ్చి బెర్తు మీద కూర్చున్నాను! పుస్తకం మధ్యలోంచి రత్నమాల యిచ్చిన టెలిగ్రాం కన్నెర్ర చేసుకు చూస్తోంది.

'చంద్రశేఖరానికి వ్యాధి మళ్ళీ తిరగబెట్టింది. త్వరగా రండి!' అని రత్నమాల పంపిన వర్తమానం అది!

చంద్రశేఖరం నే వెళ్లేదాకా బ్రతికి వుంటాడా? అనుమానమే! టెలిగ్రాం ముందర రత్నమాల వ్రాసిన ఉత్తరం నా అనుమానాన్ని బలపరుస్తోంది.

చంద్రశేఖరం వెళ్ళిపోతే రత్నమాల గతేమిటి? పుట్టింటి కెళ్ళిపోవచ్చు తల్లిదండ్రులు, అన్నదమ్ముల మధ్య భర్త మిగిల్చిన వైధవ్య జీవితాన్ని వెళ్ళమారుస్తూ కాలం గడపవచ్చు! అంతే! మరి గత్యంతరం లేదు. యిరవై సంవత్సరాల రత్నమాలకు యిది నిజంగా భరించరాని గాయమే! ఐనా తప్పదు. భరించాలి!

ఇదంతా చంద్రశేఖరం మరణిస్తే నిజం. మరణించక తప్పదు.

రత్నమాల వ్రాసిన ఉత్తరం తీసి చదివాను. ఇది ఎన్నోసారో - ఐనా రత్నమాల ఉత్తరం ఎన్నిసార్లయినా చదవాలనిపిస్తుంటుంది. ఆమె చాలా అందమైంది. ఎంతసేపయినా ఆమె మీద నుంచి దృష్టి మరోవైపుకు మళ్లదు. నేనందులో అపజయాన్ని అంగీకరించక తప్పలేదు.

ఆమె వ్రాత బాగుండదు. కానీ ఆ వ్రాతంటే నా కిష్టం!

*'రాజశేఖరంగారూ! మీరు రావాలి! నా కెందుకో భయంగా వుంది! మీరు వెళ్ళాక ఆయన పరిస్థితి మరీ దిగజారిపోయింది! ఈ కొద్ది రోజులలో ఆయన మృత్యువుకు మరీ దగ్గరగా వెళ్ళిపోతున్నారు. నాకేం తోచటం లేదు. మీరన్నా దగ్గరుంటె నాకెంతో ధైర్యంగా వుండేది. వెంటనే బయలుదేరి రండి, వస్తారు కదూ!.....'*

ఆ ఉత్తరం, ఆమె యిచ్చిన టెలిగ్రాం చూచాక బయలు దేరక తప్పలేదు!

శ్రీదేవి బలవంతం చేసింది. నా పస్తాయింపు చూచి, "వెళ్ళిరండి! పాపం చిన్నది! పైగా క్రొత్త - వాళ్ళవాళ్లెవరూ గూడా రాలేదేమో?" అని.

అప్పటికే గాలివాన ప్రారంభమైంది? యిది వెలిసాక బయలు దేరుదామనుకున్నా మొదట్లో! కాని అలా తీరిక చూసుకు పెడితే - నేవెళ్ళాల్సిన అవసరము ఉండదేమో? అప్పుడు? రత్నమాల నా మొహం చూడదు. అధవా వెళ్ళినా, ఏ లోకానో ఉండే మిత్రుడు నన్ను క్షమించడు! నాకు మనశ్శాంతి ఉండదు!

ఈ వాన - ఒంటరి ప్రయాణం.... ఎందుకు బయలుదేరానాని చికాకొచ్చింది! బాధ వేసింది. కానీ ఏం చేయలేను అంతకన్నా! రత్నమాల బయలుదేరి రమ్మని వ్రాశాక, మరి ఉండలేకపోయాను.

రత్నమాలంటే నా కభిమానమే! కాదనను. ఆమె కళ్ళు, ఆ కళ్ళలోని భావాలు ఆమె మాటలు వింటుంటే చంద్రశేఖరం మీద అసూయ కలుగుతుంది! అదృష్టవంతుడన్న

భావం కలుగుతుంది.

అవును! అంత అందమైన భార్యను పొందగలగటం ఎంత అదృష్టం? అమాయికంగా, హిమజలమంత స్వచ్ఛంగా వుంటుంది ఆమె నవ్వు! అలా ఎలా నవ్వగలుగుతోంది? ఆమె గత జన్మలో దేవతేమొ? దేవతలను చూడటం పడలేదు సినిమాలలో తప్ప! కావ్యాల్లో చదివాను! ఐతే ఏం? వాళ్ళెవరూ రత్నమాలంత అందంగా, ఆకర్షణీయంగా నాకు తోచలేదు.

చంద్రశేఖరం చాలా అదృష్టవంతుడు! అవును! యిలా అనుకోవటం ఎన్నోసారో!

బయట వాన పెద్దదైంది! లేచివెళ్ళి కిటికీ రెక్కలు మూసేశాను. ప్రొద్దుగూక వస్తున్నది! రైలు ఔటర్ సిగ్నల్ దగ్గర ఆగింది, విశ్రాంతి తీసుకుంటూ!

సూట్‌కేసులోంచి స్వెట్టర్ తీసి వేసుకున్నాను! గుండెకు వెచ్చదనం వచ్చింది!

ఇలాంటి వాన రోజు యింట్లో వుంటే ఎంత బావుండేది! శ్రీదేవి పకోడీలు చేసేది. అవి తింటూ వరండాలో కుర్చీ వేసుకుని పడే వానజల్లునీ, పారే నీటినీ, క్షణంలో జనించి లయమయ్యే బుడగల్నీ చూస్తూ కాలాన్ని గడపవచ్చు. వెచ్చటి టీ త్రాగి, సిగరెట్టు ముట్టించుకుని, కుర్చీలో వాలితే అంతకన్న స్వర్గం వేరే ఏముంది?

వానంటే నా కిష్టం! మబ్బులు పట్టటం, గాలి స్తంభించటం, అక్కడో చినుకు, యిదో యిక్కడో చినుకు పడిందనుకున్నంతలో, దబదబా, జనం పరిగెత్తినట్టు వాన పడుతుంటే చూడాలి. చూరు నీళ్ళు ధారగా పడుతోంటే వచ్చే శ్రుతిబద్ధమైన శబ్దం, తడిసిన నేల మీద నుంచి వచ్చే గమ్మత్తయిన వాసన ఎంతో బావుంటుంది! అనుభవించటం తెలియాలే గానీ!

వాన వచ్చిన రాత్రి వేడి అన్నం, వంకాయకూర, ఆవకాయ, పప్పుచారు వేసుకుని ఆపైన తిరిగి గేదె గడ్డ పెరుగు వేసుకుంటే.... అంతకన్న ఇంకేం గావాలి?

రాత్రిళ్ళు చిరుచలిగా వుంటుంది వాన కురుస్తుంటే! అప్పుడు శ్రీదేవి వెచ్చని కౌగిలిలో నేను బందీనై నిద్రపోతే.... ఒకటే విన్నపం దేవుడనే వాడుంటే... భగవాన్! నాకు మరణాన్ని యిలాంటి సమయంలో ప్రసాదించు అని కోరుకోవాలని వుంటుంది?

నిజంగానే బాధ వేసింది. యిన్నిటినీ వదలి ఎందుకు బయలుదేరినట్లు?

రత్నమాలెవరు?

చంద్రశేఖరం మరణిస్తే నాకేమిటి?

లోకంలో పుట్టటం, గిట్టటం, అనాదినుండీ నిత్యమూ యిదేవిధిగా జరిగే ప్రకృతి దినచర్య! అంతే! చంద్రశేఖరం మరణిస్తాడు! ఆ వెనుక నేనూ, రత్నమాల, శ్రీదేవి వెనక ముందుగా అందరూ మరణించాల్సిందేగా.

చంద్రశేఖరం మరణించటంలో ప్రత్యేకతేం లేదు! నేను వెళ్ళి డాక్టర్లు చెయ్యలేని మహత్తర కార్యాల్నేం చెయ్యలేను.

యిన్నీ తెలుసు! కానీ బయలు దేరాను - ఎందుకు?

చంద్రశేఖరం నా మిత్రుడు! ఈ లోకంలో అతని భౌతిక రూపం త్వరలో అంతర్ధానమౌతుంది. కడసారి క్షణాల్లో, మిత్రుడి చెంతనుండి, వాడికి వీడ్కోలు చెప్పటం నా ధర్మం. అంతకన్నా నేను చెయ్యగలిగిందేం లేదు.

రైలు గుంతకల్లులో ఆగింది.

లేచి ఫ్లాస్కు తీసుకుని స్టేషన్‌లో క్యాంటీన్ వేపు బయలు దేరాను.

:: 2 ::

నన్ను చూడగానే రత్నమాల, "వచ్చారా?" అంటుంది.

"ఏం రాననుకున్నారా?" అంటాడు తను!

అలాగే అనుకున్నట్లే నడిచిన సంభాషణకు నవ్వొచ్చింది నాకు!

రత్నమాల మొహం చిన్నబోయింది!

"ఎందుకలా నవ్వుతారు?" అన్నది మ్లానమైన మొహాన్ని ప్రక్కకు త్రిప్పుకుని!

ఏమని చెప్పేది?

వస్తూ, రైల్లో అనుకున్నట్లే జరిగింది సంభాషణ అనంటే ఏమనుకుంటుంది?

"రైల్లో వస్తూ నాగురించే ఆలోచించారా?" అనంటుంది.

అందుకు నేనేం సమాధానం చెప్పాలి?

ఎలా సమర్థించుకోవాలి?

అందుకనేం మాట్లాడలేదు!

"చంద్రశేఖరానికెలా వుంది?" అడిగాను పేరుకున్న నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ!

ఆమె కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. కానీ అవి క్రిందకు జారలేదు! ఆమె దుఃఖాన్ని ఆపుకున్నది! అక్కడ నుంచి వెళ్ళిపోయింది!

అప్పుడే సూర్యోదయమౌతున్నది. ఆకాశంలో చెదురుగా మేఘాలు గూడు కట్టుకుంటున్నాయి. గాలి చల్లగా వుంది. కంటోన్మెంట్‌లోని బంగాళాలన్నీ అప్పుడు మెల్లగా కళ్ళు తెరుస్తూ వున్నాయి. మామిడిచెట్టు మీద కోకిలొకటి సంగీత కచేరీ మొదలెట్టింది. పాలవాళ్ళు ఆవులు తోలుకు హాస్పిటల్‌కు వెడుతున్నారు, లేగలను లాక్కుంటూ. కమర్షియల్ స్ట్రీట్‌లో లారీల రొద భయంకరంగా వినపడసాగింది!

కళ్ళు మండుతున్నాయి. నీళ్ళు క్రమ్ముతున్నాయి. రాత్రి వచ్చాక నిద్ర పట్టలేదు. వళ్ళంతా నొప్పులుగా గూడా వుంది. తెల్లవారుఝామునే తెగించి షవర్ బాత్ చేశాను. డ్రస్ చేసుకుని పెరేడ్ గ్రౌండ్స్ దాకా వెళ్ళి మహాత్మాగాంధీ రోడ్‌లో ఉడిపి హోటల్‌లో కాఫీ తాగి పేపరు, సిగరెట్లు కొనుక్కొని బంగాళా కొచ్చాను. అప్పటికి ప్రాణం హాయిగా వుంది!

సోఫాలో కాళ్ళు బారజాపి పడుకుని పేపరు చదువుతున్నా. ఎప్పుడు నిద్ర పట్టిందో

అలాగే అక్కడే నిద్ర పోయాను. అంతా కొన్ని నిముషాలు!

కారొచ్చి పోర్టికోలో ఆగింది. అదీ మగతగ తెలుసు. కానీ రత్నమాల స్నానం చేసి జుత్తు ఆరబెట్టుకుంటూ వచ్చింది. తెల్లటి షిఫాన్ చీర కట్టుకుంది, రెవిక వేసుకోలేదు - నా కలా అనిపించింది. చెంగు భుజాల నిండా కప్పుకుంది. మెరుగు పెట్టిన బంగారంలా వున్నది ఆమె దేహం! నుదుట దాల్చిన కుంకుమ కళ్ళు చెదిరేంత ఎఱ్ఱగా స్పష్టంగా కనుపించింది!

"పూజయిందా?"

"ఊహూ(!..... ఉండండి! నేనూ వస్తాను ఆస్పత్రికి! .... వుంటారుగా!"

ఆమె వెళ్ళింది.

కానీ ఆమె నా కళ్ళ ముందు నుంచి కదల్లేదు. అలా చాలాసేపు ఆమె నిల్చున్న ప్రదేశంలో ఆమె లోన చిత్రణ గావించుకుంటూనే వున్నా!

చంద్రశేఖరం ఆమె నిలాగే చూస్తూ వుండేవాడు! అతడి కళ్ళల్లో భాధ, నిర్వేదం, ప్రేమ వుండేవి. రత్నమాల అతనలా చూస్తుంటే అక్కడుండేది గాదు. ఆమె వెళ్ళిన కొంతసేపటిదాకా అతనలాగే చూస్తూండేవాడు!

అప్పుడనేవాడు- "రాజూ రత్నం అందమైనదేగా!"

అది ప్రశ్నో, అతడి అభిప్రాయమో నాకు బోధ పడేది గాదు!

"ఏం మాట్లాడవేం!"

"ఏం మాట్లాడేదీ?"

"రత్నం అందమైనదేనా?"

"నేనా నిర్ణయించాల్సింది!"

"అదిగాదు రాజూ! నీ అభిప్రాయం చెప్పు!"

"నా కళ్ళకు అందమైనదిగానే కనబడుతోంది."

"అంటే నా కళ్ళకు అందంగా కనబడటం లేదనా?..... అలా అని నీకు చెప్పానా?.... మాట్లాడవేరా?..... రత్నం ఓయ్ రత్నం?"

"యిప్పుడెందుకు ఆమె?"

"వూరికినే!"

"ఐతే నే వెడతాను!"

"ఏం? కూర్చో ఆమె రాదులే!"

చంద్రశేఖరానివి తమాషా ఊహలు!

"ఏరా ఆమె వస్తే వెడతానంటావ్, భయమా?"

"భయం దేనికి?"

"మరి?"

"మీ యిద్దరి మధ్య నేనెందుకు - పుడకలాగ!"

"అంతేనా?.... లేక"

"ఊ! లేక?.... చెప్పు!"

"ఉహూ ఏం లేదు! ఆమె ఎదురుగ్గా వుంటే ఆమెను చూస్తూ వూరికే కూర్చోబుద్ది య్యదా?"

"చస్! యిలా మాట్లాడితే నే రానసలు!"

వెళ్ళేవాడిని బ్రతిమాలి కూర్చోబెట్టేశాడు!

ఒక్కోసారి చాలా హుషారుగా కబుర్లు చెప్పేవాడు! అలా చంద్రశేఖరంతో రోజుల తరబడి కూర్చుండిపోయే వాడిని. ఏం మాట్లాడుకునేవాళ్లమో, చాలా మందికి, ఆశ్చర్యం గానే వుండేది. కానీ మాకు విసుగెయ్యదు!

వెన్నెల రోజుల్లో అసురసంధ్య వేళ బయలుదేరి వూరికి దూరంగా వున్న మామిడితోట ప్రక్కన చెరువు గట్టు మీద రావిచెట్టు నానుకుని కూర్చునేవాళ్ళం. నీళ్ళల్లో చందమామ ఆకాశం మీద ప్రభవించేవాడు! కీచురాళ్ళు ఏడుస్తుండేవి! మా మాటలు వింటానికి చెట్టు చేమా ప్రాణం బిగబట్టుకు నిల్చుండేవి!

అలా మౌనంగానే కూర్చుండే వాళ్ళం! ఎందుకో మాట్లాడబుద్దెయ్యదు అక్కడి కొచ్చేప్పుడు. వెళ్ళేప్పుడు మాట్లాడుకునేవాళ్ళం!

మామిడి చెట్టు మీద కెక్కేవాడొక్కోసారి చందమామ! చవితినాడు ఆకాశంలో అవిశ పువ్వులా వుండేవాడు చంద్రుడు. రోజూ చూసే పరిసరాలే ఐనా క్రొంగొత్తగా సింగారించు కునేవి మా కోసం.

వూరు మాటుమణిగే వేళ, యిళ్ళకు వెళ్ళేవాళ్ళం!

నే వెళ్లేసరికి మా యింట్లో అంతా నిద్ర కుపక్రమించేవారు! ఒక్క అమ్మ తప్ప!

కాళ్ళు చేతులు కడుక్కుని వచ్చేసరికి అమ్మ అన్నం వడ్డించి నా కోసం ఎదురు చూస్తుండేది.

"శ్రీదేవి లేదా?"

"వుందిరా, పడుకున్నదల్లే వుంది."

"నువ్వలా చేస్తున్నావు!"

నా విసుగు, కోపం చూసి అమ్మ నవ్వేది. నా ముంగురులు సవరిస్తూ, "ఏదో చిన్న పిల్ల... ఐనా యింత రాత్రి దాకా తిరిగి రాకపోతే తిని వెళ్లగూడదూ" అని చిన్నగా మందలిం చేది.

అన్నం తిని వెళ్ళి పడుకునే వాడిని, రేపేం చెయ్యాలా అని! ప్రక్కనే శిలా ప్రతిమలా పడుకోనుండేది.

ఏ అర్ధరాత్రో మెలుకువ వచ్చేది. అప్పుడు ప్రక్కన శ్రీదేవి కనబడకపోవటం, నే లేచి

వెళ్ళి ఆమెను వెతకటం, సర్వ సాధారణంగా మామూలే!

పడమటిల్లు ప్రక్కనే చిన్నదొడ్డి వుంది. అక్కడ రెండు కొబ్బరి చెట్లు, యివతలగా తులసి కోట వుండేవి. తులసి కోట కటుప్రక్కగా కర్రావు పడుకునుండేది గతాన్ని నెమరు వేస్తూ!

అక్కడ పంచపాళీలో స్తంభాని కానుకుని కొబ్బరిచెట్ల మధ్యగా అస్తమించే చంద మామను చూస్తూ కన్నీరు కారుస్తుండేది.

జేవురించుకపోయిన మొహం, చందమామకు ప్రతిగా వుండేది!

"ఎందుకేడవటం?"

ఆమె కన్నీరద్ది, అక్కున జేర్చుకుంటే, శ్రీదేవి నా దేవి ఐయ్యేది!

యిదంతా గతం -

రత్నమాల, నేనూ కారులో హాస్పిటల్‌కు బయలుదేరాం!

అప్పటికి రవితేజములలరుతున్నా రోడ్ల మీద కాన్వెంట్ కెళ్ళే పిల్లలు ఆయాల చేతులు పట్టుకు వెడుతున్నారు. సిటీబస్సు దగ్గర క్యూలు వళ్ళు చేస్తున్నాయి. షాపులు కళ్ళు తెరుస్తున్నాయి బద్ధకంగా.

కారు మహాత్మాగాంధీ రోడ్డులోకి వెళ్ళి హోటల్ ముందర వెళ్ళి ఆగింది.

యిద్దరమూ వెళ్ళి ఫ్యామిలీ రూమ్‌లో కూర్చున్నాం.

"మీ వాళ్ళకు కబురంపలేదా?" అడిగాను.

"ఊహూ,"

"ఏం?"

"వూరికినే"

నేనూ ఆ విషయం మళ్ళీ ప్రస్తావించలేదు. కాఫీ త్రాగి ఆస్పత్రికి వెళ్ళాం.

వెళ్ళేంతదూరం, తలంటుకున్న వెంట్రుకలనీ, నుదుట మెరిసే తిలకాన్నీ, పండిన దొండపండులా వున్న పెదవులనూ చూస్తూ కూర్చున్నాను. ఆమె సీట్‌లో ఓ మూలగా వొదిగి కూర్చుని బయటకు చూస్తూ వుండిపోయింది.

గదులన్నీ దాటుకుంటూ చంద్రశేఖరం బెడ్ దగ్గరకు వెళ్ళాం.

ఎర్రటి శాలువా క్రింద చలన రహితంగా వున్నాడు చంద్రశేఖరం. మొహం పాలి పోయింది. నల్లని గడ్డం అందంగానే వున్నా, సమయోచితంగా మాత్రం లేదు.

నాకు అట్టే ఆశ కనపడలేదు. మళ్ళీ యిద్దరం కలసి, వూరి బయట మామిడి తోపు దగ్గరకెళ్ళి రావిచెట్టు దగ్గర మౌనంగా కూర్చోలేము.

అతడి ఖర్చు మీద యాత్రలు చేయలేను.... నన్ను తనంతగా చూచుకుని గౌరవించి, క్షేమం కాంక్షించే వాడిహ వుండడు.

ఆ క్షణం నాకు ఎలాగో వుంది. మాటల్లో చెప్పలేను. నా కసలు దుఃఖం రాదు.

కన్నీళ్ళు రావు. ఐనా నాకు బాధ కలగలేదు. నడిరోడ్డు మీద గర్భిణీ స్త్రీ మీదుగా లారీ వెళ్ళినప్పుడు అక్కడే వున్నాను.

యివేవీ నా హృదయాన్ని చలింపచేయలేదు.

కానీ చంద్రశేఖరం పోలేదింకా ఈ ప్రపంచాన్ని వదిలి. కానీ పోతాడు.... మా స్నేహ బంధాలు త్రెంపుకుని అంటే నిర్వీర్యుడనయ్యాను.

ఇదంతా నిజం గాదు, అవి భ్రమ కలిగింది ఓ లిప్తకాలం!

కానీ తెలుసు కల గాదని.

గుండెల్లో దుఃఖం పెల్లుబికింది. పెదిమలు బిగబట్టుకున్నాను. ఫలితం లేదు. కన్నీళ్ళెలా ఆపుకునేది? ఏలా?

"ఏడుస్తున్నారా?"

రత్నమాల ఆశ్చర్యపోయింది.

"లేదు" అబద్ధమాడాడు.

"ఉహ్" నిట్టూర్చింది రత్నమాల.

నే వెళ్ళి కిటికీ ప్రక్కన నిలబడ్డాను. ఫౌంటెన్ నీళ్ళు చిమ్ముతున్నది. జనరల్ వార్డు దగ్గర రిక్షాలు గుంపుగా చేరాయి, కార్లను రానీయకుండా. నర్సులు నవ్వుకుంటున్నారు ఏదో చెప్పుకుని?..... ఫినాయిల్ వాసన గాలిని కౌగలించుకుంది.

చంద్రశేఖరం చిన్నగా మూలిగాడు.

రత్నమాల బెడ్ మీద కూర్చుని చంద్రశేఖరం ముంగురులు సవరిస్తున్నది.

నేను చంద్రశేఖరం దగ్గిరగా వెళ్ళి నిల్చున్నాను. కళ్ళెత్తి నా వైపొకసారి చూచి కళ్ళు మూసుకున్నాడు చంద్రశేఖరం. మగత మళ్ళీ కమ్మేసింది.

"మాట్లాడలేదా?"

"చాలా రోజులైంది మాట్లాడక. మీరు వెళ్ళాక రెండు రోజులు మాట్లాడారు. ఆ తర్వాత మళ్ళీ వ్యాధి తిరగబెట్టింది. మాట్లాడలేరు. మనుషుల్నీ గుర్తు పట్టలేరు."

చెప్పటం ఆపి క్షణం ఆలోచించి, "నేనసలిక్కడుండటం అనవసరం".

"అదేం?"

"ఎందుకలా ఆశ్చర్యపోతారు? నేనుండి ఆయనకేం చేయగలను? డాక్టర్లున్నారు మందివ్వటానికి, నర్సులున్నారు సేవ చేయటానికి. అయినా ఎవర్నీ గుర్తు పట్టలేరు. అప్పుడు నేను లేకపోతే వచ్చిన నష్టమేముంది?"

"మరి ఎందుకున్నట్లు?" కోపంగానే అడిగాను.

"అదే నిర్ణయించు కోలేకుండా వున్నాను. నా మెడలో వారు కట్టిన మంగళసూత్ర ముంది. సంఘము, కొన్ని కట్టుబాట్లు వున్నాయి. యిన్నిటినీ దాటలేనేమోనని భయం."

"మీకా భయం మాత్రం దేనికి?"

"నేను స్త్రీని!"

"కాదనను! కానీ స్త్రీగా మీ కర్తవ్యాన్నుంచి తప్పుకోవాలని ప్రయత్నిస్తున్నారు!"

"నా కసలు కర్తవ్యమేముంది?"

"ఏమీ లేదన్నమాట! కట్టుకున్న భర్త జీవితానికీ, మరణానికీ మధ్య కొట్టుకుంటున్నాడు. బ్రతికినంతకాలం మిమ్మల్ని ప్రేమించి, మీ ఆనందానికి సౌఖ్యాలకు ఆలవాలమైన మనిషి, అతడికీ మీకు ఏ అనుబంధమూ, ఆత్మీయతా లేదా? ఆ మనిషిని ప్రాణం కన్న ఎక్కువగా ప్రేమించి, రక్షించుకోవటం మీ కర్తవ్యం గాదా!"

"ప్లీజ్! యిక్కడ అంత గట్టిగా మాట్లాడకూడదు! అలా బయటకు వెళ్ళి మాట్లాడుకోండి" సిస్టర్ హెచ్చరించింది.

నేను చాలా నొచ్చుకున్నాను. ఇంత ఆవేశంగా, పరిసరాలు కూడా గుర్తించకుండా మాట్లాడినందుకు. పైగా నే అన్న మాటల గురించి ఆలోచన యింకా సుళ్ళు తిరుగుతూనే వుంది!

మధ్యాహ్నం పోస్టుఆఫీసుకు వెళ్ళి అయిన వాళ్ళందరికీ టెలిగ్రాములు, ఉత్తరాలు పంపాను. అసలింతదాకా చంద్రశేఖరం పరిస్థితి ఎవ్వరకూ తెలియదు - ఒక్క నాకు, ఎస్టేట్ మేనేజరుకూ, మరికొందరకూ తప్ప. అలా దాచేసింది రత్నమాల.

కారణం ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అంతు చిక్కలేదు!

సాయంత్రం చంద్రశేఖరాన్నొకసారి చూసి వచ్చాను! రత్నమాల నాకు కనబడలేదు! నేనూ ఆమె నుంచి తప్పుకు తిరిగాను.

ఆమె గూడా అంతే గావచ్చు!

ఆస్పత్రి నుంచి, కర్బన్ పార్క్ వెళ్ళి, ఒక మూలగా, జనసమర్దం లేని చోట కూర్చున్నాను. పార్క్‌లో లైట్లు చీకటిని పార్క్‌లోంచి బయటకు గెంటివేయసాగాయి. పిల్లలు ఆడుకో సాగారు! ఓ పక్కగా దంపతులు పచ్చగడ్డి తివాచీ మీద తీరిగ్గా కూర్చుని వేరుశనక్కాయల డొక్కలు చించేస్తున్నారు, ఓ విమానం ఆకాశంలో కళ్ళు ఆర్పుతూ, తెరుస్తూ షికారు చేయసాగింది.

చంద్రశేఖరం కాలేజీలో నేస్తం నాకు. అంతకు ముందు పరిచయం లేదు. అతనెవరో నాకు చిన్నప్పట్నుంచీ తెలుసు! నేను వాళ్ళ పురోహితుడి కొడుకునని తెలుసుకుని, నన్ను ఆంతరంగికుల్లో జమకట్టుకున్నాడు!

"మీరూ వేదం, పంచ కావ్యాలు నేర్చుకున్నారా!"

"ఆ"

"మరి మీ నాన్నగారు శుద్ధశ్రోత్రియులు గదా! మిమ్మల్ని ఇంగ్లీషు చదువులో ఎందుకు ప్రవేశపెట్టారు?"

చెప్పాను!

"చాలా తమాషాగా వుంది! మీ నాన్నగారికి యింత అధునాతన దృష్టి, ఆలోచనా వున్నాయంటే ఆశ్చర్యంగా వుంది!" అని ఆశ్చర్యపోయాడు.

చంద్రశేఖరం ఆటలేవీ, ఆడేవాడు కాదు. కానీ నాతో గ్రౌండ్స్‌కి వచ్చేవాడు! నే టెన్నిస్ ఆడుతుంటే ఆసక్తిగా చూచేవాడు.

ఆటను గురించి తెలుసుకునేవాడు.

"నీకున్నంత ఆరోగ్యం, శక్తి నాకు లేవు రాజూ! నిన్ను చూస్తుంటే నాకు అసూయగా వుంది" అనేవాడు.

అతన్నీ ఆటల్లో పాల్గొనమని ప్రోత్సహించేవాడిని. ఫలితం లేకపోయింది. అతనికి చదరంగం యిష్టం. నాకు చేతగాదు. నేర్చుకోవాలన్న ఉత్సాహమూ లేదు నాకు.

యివేవీ మా స్నేహాన్ని విచ్ఛిన్నం చేయలేదు.

మా వూళ్ళో వున్నప్పుడు, ఒక్కోసారి స్వయంగా మా యింటికి వచ్చేవాడు.

మా నాన్నగారు ఒకసారి నాతో, "రాజా! ఆయన జమీందారుగారబ్బాయి, పైగా చాలా అబ్బురంగా పెరిగాడు. నీ కోసం అతను యిక్కడకు రావడం పెదబాబుగారికి తెలిసుండదు. తెలియదు గూడ! నువ్వే కోటకు వెడుతూ వుండు! అది మన ధర్మం! అందుకు పెదబాబుగారు సంతోషిస్తారు" అని చెప్పారు.

ఆనాటి నుంచీ, నేనే, చంద్రశేఖరం దగ్గిరకు వెళ్ళేవాడిని.

అతడు జమీందారుగారబ్బాయనీ గాదు, మేమాయన ఆశ్రితులమనీ గాదు ప్రశ్న. మా యింట్లో కూర్చునేందుకు, విడిగా గదిలో కూర్చొని సిగరెట్లు త్రాగుతూ కబుర్లాడుకునేందుకు అవకాశం లేదు. పైగా మా నాన్నగారికి పెద్దబాబుగారంటే వున్న ప్రేమాభిమానాలు అనంతం.

చంద్రశేఖరమూ, నేనూ గదిలో కూర్చుని కాఫీ త్రాగుతూ, పేకాడుకునేవాళ్ళం. కబుర్లు చెప్పుకునేవాళ్ళం; చాలా హాయిగా వుండేవా రోజులు.

పెద్దబాబుగారి మరణంతో చంద్రశేఖరం స్వేచ్ఛాజీవి ఐనాడు.

ఆ తర్వాత చంద్రశేఖరం తరచూ కాఫీ త్రాగడం మానేశాడు. బ్రాందీ త్రాగేవాడు. నన్ను మధ్య మధ్య కాఫీ త్రాగకుండా చేసేవాడు.

'ఈ విషయాలన్నీ మా నాన్నగారి అవసానకాలంలో తెలిశాయి. మంచంలో రోగంతో అవస్థపడుతూ నన్ను పిలిచి, "విన్నదంతా నిజమేనా?" అని అడిగారు. అప్పటికే ఆయన కనుకొలుకుల్లో కన్నీళ్ళు చేరాయి.

చెప్పాను. ఆయన ముందు అబద్ధమాడలేను.

ఆయన కాసేపు దుఃఖించారు. "నాకొక వాగ్దానం చేస్తావా? నాయనా" అనడిగారు.

"చెప్పండి."

"ఇకముందు దాని జోలికి పోనని వాగ్దానం చెయ్యి."

చేశాను. నాకూ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నాయనా నువ్వు పుట్టింది అగ్నిలాంటి వంశం. స్వధర్మం నుంచి, వృత్తి నుంచి దూరం చేశాను. అంటే వాటి మీద గౌరవం లేకగాదు. కాలంతో పాటూ మనమూ మారాలని. రాజులు, సంస్థానాలు అంతరించిపోయాయి. బ్రాహ్మణ్యం మీద యిదివరకటి గౌరవమూ లేదీనాడు. అందుకు మనమే కారణం, ఈ పరిస్థితుల్లో క్రొత్తదారి వెతుక్కోవాలని, నిన్నా మార్గానికి మళ్ళించాను. అంతే. మన వంశానికి, ధర్మానికి తలవంపులు తేవాకు అదే నే కోరేది."

ఆనాడు ఆయన చెప్పిన మాటలింకా మారుమ్రోగుతూనే వున్నాయి చెవుల్లో.

పార్కు నిర్మానుష్యం కాజొచ్చింది. లేచి యింటికి బయలు దేరి వెళ్ళాను.

అన్నం తింటున్నాను. ప్రక్కనే రత్నమాల పీట వేసుకు కూర్చొనుంది, కావల్సినవి వడ్డిస్తూ,

"మీరు భోంచేయరా?"

"ఉహు"

"ఏం?"

"శనివారం గదా?"

"ఈ పుణ్యమంతా ఎవరి కోసం?"

"నా కోసమే"

"దేవుడిని పూజ చేసేప్పుడేం కోరుకుంటారు?"

"చెప్పమంటారా?"

"చెప్పండి."

"అన్నం తినండి."

"చెప్పండి - నాకు కబుర్లు నంజుకుంటూ తినటం అలవాటు."

"వచ్చే జన్మలోనైనా స్త్రీగా పుట్టించకుండ వుండమని! స్త్రీగా పుట్టించినా భోగ భాగ్యాలు కలిగిన యింట్లో పుట్టించకుండా అని, పుట్టించినా యిలాంటి భర్తను కట్టబెట్టవద్దని."

"అంటే......" ముద్ద మ్రింగుడు పడలేదు నాకు.

రత్నమాల చాలా సీరియస్‌గా వుంది. అగ్నిగోళమేదో పెఠిల్లుమని బ్రద్దలయ్యేందుకు సిద్ధంగా వుందని గ్రహించాను.

"మంచినీళ్ళు కావాలా?"

"వద్దు - చెప్పండి."

"పోనీలేండి ఒకళ్ళు అర్చేది తీర్చేదేం గాదు - మీకు చెప్పి ప్రయోజనమేముంది."

"మీరెందుకలా నిరుత్సాహపడతారు? నేనై చెయ్యగలిగిందేదైనా వుంటే తప్పక చేస్తాను."

"నిజం?"

"వాగ్దానం చెయ్యమంటారా?"

"అక్కర్లేదు. యిప్పుడన్న మాట జ్ఞాపకముంచుకోండి. మాట తప్పకండి. అది చాలు."

"చెప్పండి."

"వివాహిత ఐన స్త్రీ కోరుకునేదేమిటి?"

"క్విజ్ కాదు గదా."

"కాదు, చెప్పండి."

"దాంపత్య సుఖం."

"ఊ..... అదే కరువైతే?"

నాకు మాట పెగల్లేదు. కొన్ని క్షణాలు ఊపిరి సలుపలేదు. అన్నం తినబుద్ధి వెయ్యలేదు.

"మీరు చెప్పిందే నిజమైతే నేను చాలా చింతిస్తున్నాను."

"ఇందులో అబద్ధమాడాల్సిందేం లేదు. ఐనా యింత స్నేహితులై వుండీ మీకీ విషయాలు తెలియవంటే చాలా ఆశ్చర్యంగా వుంది."

చెయ్యి కడుక్కుని వచ్చేశాను, రత్నమాల మాటలు ఖాతరు చెయ్యకుండా.

గదిలో వాలు కుర్చీలో పడుకుని రత్నమాల చెప్పిన మాటల గురించే ఆలోచించ సాగాను.

"మధ్యలో అర్థాంతరంగా లేచి వచ్చారు. ఈ పాలు త్రాగండి."

పాల గ్లాసు టేబుల్‌పై వుంచి వెడుతూ, "మీరనవసరంగా బుర్ర పాడుచేసుకోకండి. ఎవరికీ తెలియనివ్వకుండా వుంచుదామనే అనుకున్నాను. సాధ్యం గాలేదు. ప్రొద్దున మీరన్న మాటలు వూరికే పోలేదు. ఇప్పటి వరకూ వాటిని గురించే ఆలోచిస్తున్నాను" అన్నది రత్నమాల.

గతాన్నొకసారి సింహావలోకనం చేసుకుంటే రత్నమాల ప్రవర్తనలో, మాటల్లో తప్పు పట్టాల్సిందేమీ లేదు.

ఆమె చాలా అందమైనది. ఆమె దేవతనే వృక్షంలా కనబడుతోంది.

సిరి, సంపద, అభిజాత్యము గల పడుచు ఆమె.

రత్నమాలను చూస్తే, ఈవేళ జాలి వేసింది. మొదటిసారిగా.

:: 3 ::

బెంగుళూరు వచ్చేసి పదిహేను రోజులైంది నేనూ, రత్నమాల కలసి. చంద్రశేఖరం రాలేదు. యిన్నాళ్ళూ కోట వేపు వెళ్ళనేలేదు. వెళ్ళాలనిపించలేదు. వెళ్ళి చేసేదేముంది? నాతో మాట్లాడేది. నాకోసం ఎదురు చూసే చంద్రశేఖరం లేడక్కడ.

ఇంటి నిండా చుట్టాలు, అప్తులు వుంటారు. వాళ్ళకు నాకు, చంద్రశేఖరానికిగల స్నేహానుబంధాలు తెలియవు. తెలిసిన రత్నమాల శోక సముద్రములో మునిగి వుంటుంది.

ఆమెను ఓదార్చే వాళ్ళు, సానుభూతి తెలిపేవాళ్ళ మధ్య, అశోకవనంలో సీతలా, రత్నమాల.... జాలి వేసింది.

వచ్చాక గడ్డం గీసుకోలేదు. తల దువ్వుకోబుద్ధెయ్యలేదు. యాంత్రికంగానే దినకృత్యాలు జరిగిపోతున్నాయి. సూర్యాస్తమయాలు నాకు పట్టలేదు.

ఓ సాయంత్రం కోట నుంచి కబురొచ్చింది! ఓ విధంగా అందుకు నేను ఎదురు చూస్తున్నాను గూడా! వచ్చాక రత్నమాలను చూడలేదు! అది నాకు బాధగానే వుంది. చంద్రశేఖరం మరణం నన్నెంతగా క్రుంగదీసిందో ఆమెకు వాటిల్లిన దుఃఖంలో నేనెంత పాలుపంచుకున్నానో ఆమెకు తెలియనియ్యటం ధర్మం!

"ఇలాగే వెడతారా?" శ్రీదేవి అడిగింది.

"ఏం?"

శ్రీదేవి అద్దం తెచ్చి, "చూసుకోండి" అన్నది.

కళ్ళు ఎర్రగా వుండి, వుబ్బినాయి. జుత్తంతా రేగి మట్టికొట్టుకు మాసి వుంది. నల్లగా పెరిగిన గడ్డం అందంగానే వుంది.

శ్రీదేవికేం చెప్పకుండా, వీధిలో పడ్డాను, కానీ ఆమె దీర్ఘ నిశ్వాసం నాకు వినిపించింది.

కోట కెళ్ళేంతవరకూ తలెత్తలేదు. అప్పటికీ ఆ అవసరము కలక్కపోను. గేటు దర్వాను అప్పలనర్సయ్య, నన్ను చూచి, "బాబూ" అని బావురుమన్నాడు. ముసలితనం, ఆపుకోలేని దుఃఖంతో అతను లుంగచుట్టుకు పోయాడు.

నా కళ్ళల్లోనూ నీళ్ళు నిలిచాయి. నన్ను చూచినప్పుడు వీళ్ళంతా తమ యాజమానిని జ్ఞాపకం తెచ్చుకుని బాధపడతారు. చంద్రశేఖరం నీడనా నేను.

వరండా దగ్గర ఎస్టేట్ మేనేజరుగారు చూపులతోనే పలకరించారు.

"రత్నమాలగారెక్కడున్నారు? చూడొచ్చునా?"

ఆయనేం చెప్పలేదు, నౌకరును పిలిచి నా వెంట పంపారు.

చాలా రోజుల తర్వాత అంత భవనంలో మరీ నిండుగా జనం కనిపించారు. చంద్ర శేఖరం పెళ్ళి తర్వాత మళ్ళీ అంతమందిని చూడటం ఇదే మొదటిసారి.

వాళ్ళంతా నన్ను వింతగా చూచారు. ఓరకంటితో వాళ్ళ కళ్ళలోని భావాలు తెలుసు కున్నాను. చంద్రశేఖరం పోయాక నేనా యింట్లో అపరిచిత వ్యక్తినే అని తెలుసుకున్నాను.

ఓ గదిలో మూలగా కూర్చోనుంది రత్నమాల. ఆమె వదనం చాలా దీనంగా, పేలవంగా గూడ వుంది. కూర్చోమని కళ్ళతోనే చెప్పింది.

"రమ్మన్నారుట?"

"అవును, మీరీ చాయలకే రావటం మానుకున్నారేం? ఆయనతో పాటే మీకీ యింటితో ఋణం తీరిందనుకున్నారా?"

"అదేంగాదు."

"మరి! మీ రొస్తారని రోజూ చూస్తున్నాను, రారని తెలిశాక కబురంపాను."

కాసేపు ఏం మాట్లాడాలో తోచక మౌనంగానే వుండిపోయాను. ఆమె కొంతసేపు తల వంచుకుని, గచ్చు మీద గీతలు గీస్తూ వుండిపోయింది.

"కొన్నాళ్ళిక్కడే వుండిపోతారా?"

"యింకా ఏమి నిర్ణయించుకోలేదు. మీ ఉద్దేశ్యమేమిటి?"

"నేను కాదుగా మీ భవిష్యత్తు నిర్ణయించాల్సింది, అయినా మీ తల్లిదండ్రులున్నారు, బంధువులున్నారు! వాళ్ళేమంటున్నారు?"

"ఆస్థి, అప్పులు తేల్చుకుంటున్నారు, నా గురించి ఎవరికీ పట్టటం లేదు, కొన్నాళ్ళు పోయాక మళ్ళీ వివాహం చెయ్యొచ్చు, వివాహమంటే వాళ్ళకో వేడుక."

"నిజంగా వేడుకేగా! కాకపోతే పెళ్ళి ఐన రెండేళ్ళకే మీరిలా అవుతారని తెలిస్తే, అంత వైభవంగా ఎందుకు చేస్తారు మీ వివాహం."

"సరేలే! పోనీయండి? బ్రతికి బావుంటేగదా అన్నీ....."

"అంటే?"

"మరేం లేదు. ఈ అవతారం చాలించేద్దామని వుంది. కేవలం విధి చేత, ఐనవాళ్ళచేత కీలుబొమ్మలాగా ఆడింపబడటం నా కిష్టం లేదు."

"మన యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా చాలా జరుగుతుంటాయి."

"అందుకే ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాను."

నేనేమీ చెప్పలేదు.

"మీరానాడు నాకో వాగ్దానం చేశారు. జ్ఞాపకముందా?"

యిప్పుడా ప్రస్తావన ఎందుకు తెచ్చిందో నాకు తెలియదు. ఆమె ఈ ప్రశ్న చాలా రోజుల నుంచీ అడగాలని యత్నిస్తున్నట్లే నిర్ణయించుకున్నాను.

"మర్చిపోయారా?"

"లేదు."

"ఆడిన మాట తప్పటం, చేసిన వాగ్దానం భంగపరచటం ధర్మమేనా?"

"కాదు, కానీ నన్ను ఆలోచించుకోనీయండి."

"ఆలోచించుకోండి, మరో వారంలో మీ నిర్ణయం తెలియజేయండి. ఆ తర్వాత మీరే నిర్ణయం చేసినా ప్రయోజనం వుండదు."

"సరే!"

వచ్చేశానక్కడనుంచి.

రాత్రి వెన్నెల చీర ధరించింది. ఆమె అందానికి ప్రకృతి పరవశించింది. కొలనులో మల్లెచెండులా చంద్రుడు తేలుతున్నాడు ఆకాశంలో.

ఆరుబయట మంచం వేసుకుని పడుకున్నాను. నిద్ర ఎక్కడికి పోయిందో మరి

జాడ లేదు.

ఏవేవో భావనలు అలల్లా మస్తిష్కంలో లేస్తున్నాయి. పడిపోతున్నాయి. వాటికి అంతు లేదు. దరి చేరలేవు.

శ్రీదేవి మధ్య ఓసారి తలెత్తి చూచి మత్తుగా వళ్ళు విరుచుకుని, చీరచెంగు కప్పుకుని "యింకా పడుకోలేదా" అన్నది.

మెల్లగా వీచే చల్లగాలికి శివాలయంలోని ధ్వజస్తంభం చిరుగంటలు గునగునలాడుకో సాగాయి.

రత్నమాల పాము కుబుసం లాంటి చీర ధరించింది, ఎఱ్ఱగన్నేరు లాంటి చోళీ, కలరు వేసుకుంది. కాటుక గీతల మధ్య గాజు గిన్నెలో మీనంలా కళ్ళు పరిభ్రమించ సాగాయి, కోరికలతో బంగారు కలశాల్లా కుచద్వయం ఉశ్వాస నిశ్వాసాలతో సమంగా ఎగిసిపడుతుంటే నడుము ఆపలేక ధనస్సులా జవజవ లాడసాగింది. కాళ్ళకి పారాణి అందంగా వుంది. గుండ్రటి మెడకు చుట్టుకుని మురిసిపోసాగింది, రత్నాలు పొదిగిన చంద్రహారం! ఆమె బుగ్గల్లో కెంపులు కళ్లు తెరిచాయి.

అలా దర్శనమిచ్చింది నాకు రత్నమాల.....

కోరి వచ్చిన స్త్రీని కాదనటం ధర్మం కాదని మనస్సు నిర్ణయించింది. అదే ధర్మమని నిశ్చయించుకున్నాను. 'వనిత తనంత తా వలచి వచ్చి చుల్కన గాదు.' నా మట్టుకు నాకు.... పెద్దనకు నా లాంటి వాళ్ళుంటారని తెలిస్తే తప్పు సరిదిద్దుకుంటాడేమో!

కోరిక నాగుబాములా నాలుకలు చాచసాగింది. కామాగ్నిలో దేహం శిధిలమవ సాగింది. నరాల్లో రక్తం లావాలా వుప్పొంగి పోటు సముద్రంలా పొంగ సాగింది. ఊపిరి పీల్చటం కష్టమైంది. ఏ ఊహలో మాటలో వస్తువులో గూడ రత్నమాల ప్రతిబింబించ సాగింది.

గడ్డం గీచుకున్నాను. తీరిగ్గా తలంటుకున్నాను. గ్లాస్కో లాల్చీ, ఖద్దరు పంచ కట్టు కున్నాను. అత్తరు గూడ వ్రాసుకున్నాను.

అన్నీ సరిచూసుకు బయలు దేరాను కోట వేపు, శ్రీదేవి చూపులను నిర్లక్ష్యంగా వదిలేసి.

సాయంత్రం అందంగా వుంది వలపు నేర్చుకున్న కన్నెపిల్లలా!

మనసు మాట వినని గుఱ్ఱంలా విహరించసాగింది. అడుగులు తేలిపోతున్నాయి.

మెయిన్ గేటు దాటి వరండాలో అడుగు పెట్టాను. అక్కడ కొందరు చతుర్ముఖ పారాయణం చేస్తున్నారు. నన్నెవరూ పట్టించుకోలేదు.

దాసి నడిగితే 'అమ్మగారు పైనుంటారూ' అని చెప్పింది అదోలా చూసి.

నవ్వుకున్నాను దాని చూపుకు.

మరికొన్ని క్షణాల్లో నాకు పట్టబోయే సిరి దానికి తెలియదు. తెలిస్తే అలా ప్రవర్తించదు.

పెద్ద ఆస్థికి, అనుభవానికి వారసుడిని కాబోయే నేను చాలా హుందాగా వుండాలి. చిన్న విషయాలు పట్టించుకోగూడదు. కనుక దాన్ని క్షమించేశాను.

వరండా దాటంగానే పెద్ద హాలు. పూర్వం అక్కడ పెద్దబాబుగారు కచేరి చేసేవారు. నేడేం వుపయోగం లేదు. దాన్నిండా బీరువాలు, కుర్చీలు, సోఫాలు, వున్నాయి. అక్కడ క్షణం నిల్చుని హాలంతా పరికించాను.

హాలుకు ఎడమ ప్రక్క ద్వారముంది. ఆ ద్వారం మీద చంద్రశేఖరం తాతగారి తైలవర్ణ చిత్రముంది. ఆ ప్రక్కనే పెద్ద పులి తల. అది ఆయన చంపినదే.

హాలుకు మధ్యభాగంలో గాజుదీపాలున్నాయి. ఆ పైగా పిచ్చిక గూడుంది. ఆ పిచ్చిక గూడును పెద్దబాబుగారు చాలా ప్రేమగా చూచేవారు. ఆయన బ్రతికున్నంత కాలం దాన్నెవరూ ముట్టుకోలేదు. ఇప్పుడూ అలాగే వుంది.

ఎప్పుడు చూసేవే యివి. అయినా అందంగా వున్నాయి కళ్లకు. కుడిప్రక్కగా మేడ మీదకు మెట్లున్నాయి.

సిగరెట్ వెలిగించి, గట్టిగా దమ్ము లాగి హుషారు రెట్టించుకుని ప్రక్కకు తిరిగా.

ఎదురుగ్గా చంద్రశేఖరం.

నవ్వుతూ నిల్చున్నాడు. సన్నగా వుండేలు బద్దలా వున్నాడు! తెల్లగా గూడ వున్నాడు. కళ్ళల్లో వింత కాంతి వుంది. పెదవుల మీద పల్చటి చిరునవ్వు ఉంది. చేతులు కట్టుకు నిల్చున్నాడు. తెల్ల లాల్చీ వేసుకు ధోవతి కొన లాల్చీ జేబులో పెట్టుకున్నాడు.

అలాగే చూస్తూ నిల్చున్నాను. అతడూ అలాగే నన్నే పరీక్షగా చూడసాగాడు.

అతడు నాకు స్నేహితుడు. తన హోదాను, డబ్బుని లెక్క చేయకుండా తన స్నేహాను బంధంలో ఆఖరి క్షణం వరకు నన్ను దగ్గరకు తీసుకున్నాడు.

తనకు, నాకు తేడా ఏం చూపెట్టలేదు. తనతోపాటే దేశాలు త్రిప్పాడు. అనుభవాలు నేర్పించాడు. జీవితంలో మధువును చవి చూపించాడు.

"నేను కష్టపడి సంపాదించుకున్నది నీలాంటి మంచి మిత్రుణ్ణి మాత్రమే రాజూ! మంచి మిత్రుడు దొరకటం పూర్వజన్మ సుకృతమని అంటారు. కావచ్చు. నేను చాలా దుడుకువాణ్ణి, భయస్తుణ్ణి గూడ, నా ఈ స్వభావం వల్ల మన స్నేహానురాగాలకు భంగం రాదని నన్ను నీ నీడగా చూసుకుంటానని మాటియ్య!" అన్నాడొకసారి.

మా స్నేహానికి భంగం రాలేదు. మా పరిధి దాటలేదు. ఏ ఉద్రేకమూ మమ్మల్ని వేరు చేయలేదు. కాలమూ, సభ్యతా, సంప్రదాయమూ, మమ్మల్ని దగ్గరకే చేర్చినవి.

మొదటి మెట్టు మీద నుంచి అడుగు మరో మెట్టు మీద పడలేదు. అసాధ్యమని తెలుసుకున్నాను.

"నాయనా, నువ్వు అగ్నిలాంటి వంశంలో పుట్టావు, నీ తాత ముత్తాతలు స్వధర్మాన్నుంచి వేరు అయి, అక్రమ మార్గాన ఏనాడు సంచరించలేదు; మనిషికో నియమముంది,

ధర్మముంది, వాటిని కాలదన్నితే ఆ మనిషి కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలకు ఎర అయిపోతాడు. అతడికి విలువ ఉండదు. గౌరవభావ ముండదు. అప్పుడా జీవి బ్రతికినా జీవచ్ఛవంలాంటి వాడే - అలా బ్రతక్కు'' అనేవారు, చెప్పేవారు మా నాన్న.

నిజం, ఆయన మాటల్లో సత్యముంది.

నేనెందుకిప్పుడు పతనమవ్వాలి? చంద్రశేఖరంతో గల స్నేహాన్ని యిలా ఎందుకు కలుషితం చెయ్యాలి? క్షణికోద్రేకానికి లోనై నలుగురి దృష్టిలో నగుబాట్లెందుకావాలి?

కట్టుకున్న యిల్లాలుంది. వంశ మర్యాద వుంది. సాంప్రదాయ ముంది. మరి నేను ఆశతో యిలాంటి దురూహకు ఎందుకు లోనైనాను?

వెనక్కు తిరిగాను. మనస్సు తేలికైంది. ఉద్రేకం చల్లారిపోయింది. దేహమంతా చిరు చెమట పట్టింది. చల్లటి గాలి ఆహ్లాదపరిచింది.

పనివాడిని పిలిచి చీటి మీద "నన్ను క్షమించండి, నా వాగ్దానాన్ని నిలబెట్టుకోలేను, అశక్తుణ్ణి'' అని వ్రాసి రత్నమాల నుండి గృహోన్ముఖుడనైనాను, తండ్రి కిచ్చిన మాట నిలబెట్టుకున్నాన్న తృప్తితో!

ఓ రోజు సాయంత్రం రత్నమాల మనిషి చేత చిన్న పెట్టి, ఓ చీటీ యిచ్చి పంపింది.

శ్రీదేవి పెట్టి తెరిచి చూచింది. ఆమె కళ్ళు ఆశ్చర్యంతో విప్పారినవి.

"రత్నమాల ఎందుకు పంపినట్లు?'' అడిగింది శ్రీదేవి.

ఆమె పంపిన చీటీ విప్పాను....

రాజశేఖరం గారికి,

..... మీరు చేసిన వాగ్దానం భంగపరిచారు. మీరు ఉదారంగా ప్రవర్తించారు. స్వధర్మాన్నుంచి రక్షించుకున్నారు. అది మీకు తృప్తినిచ్చి వుంటుంది. కానీ నేను మీ ముందు తలెత్తుకు తిరగలేను; యింత సిరిసంపద వున్నది. నేను అనాకారినీ గాదు ఐనా మిమ్మల్ని పొందలేకపోయాను. మీ దృష్టిలో నాకున్న విలువ ఈపాటిది. రత్నముంది; దాన్నెందరో విలువగా చూస్తే అది రత్నం; లేకపోతే రాయి కన్నా హీనమైందేగా! నేనూ అంతే! నాకు విలువ లేదు! నాకు జీవించాలనే ఆసక్తీ, ఉత్సాహమూ గూడ లేవు.

ఈ రత్నమాల నా గుర్తుగా వుంచుకోండి. నేనెలాగో మీకిక గుర్తుండను. మీరీ ఉత్తరం చదివేసరికి మీ మిత్రుడి దగ్గర కెళ్ళిపోతాను.

రత్నమాల!''

కన్నీళ్ళు జలజల రాలాయి అక్షరాలతోపాటు. రత్నమాల చేజారిపోయింది!

శ్రీదేవి కిదేమీ అర్థంగాలేదు నన్ను రత్నమాలను పరీక్షగా చూడసాగింది!

"మీరు పొరబాటు చేశారు'' అన్నది శ్రీదేవి!

నాకూ సంశయంగానే వుంది! నిజంగానే పొరపాటు చేశానా?

స్త్రీ, హృదయాన్ని చదవటంలో పొరపాటు పడ్డానా..... అన్నది తేలని సమస్య. •